క్లుప్తంగా

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని బీజేపీ ఇన్‌చార్జి చల్లా వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

జి.సిగడాం: మండలంలోని సంతవురిటిలో ఈ-క్రాప్ నమోదును ఏఓ శారద గురువారం పరిశీలించారు. పంటలు నష్టపోతే పరిహారం అందేందుకు ఈ-క్రాప్ ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన టాబ్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసి ఈ-క్రాప్ నమోదు చేయాలని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు సూచించారు. ఏఈఓలు, వీఆర్‌ఓ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రెడ్డి రామకృష్ణంనాయుడు

జి.సిగడాం: స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండల మహిళా రైతు ఉత్పాదారుల సంస్థ కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలిగా టంకాల చిన్నమ్మడు (టి.డి.వలస), ఉపాధ్యక్షురాలిగా మదునూరి చంద్రమౌళి (రౌతుపేట), కోశాధికారిగా సిరుగుడు అనురాధ (జి.సిగడాం), కార్యదర్శిగా మండాది పార్వతి (ఆనందపురం), ఉప కార్యదర్శిగా బోనే సంతోషి (బాతువ) ఎన్నికయ్యారు. అనంతరం రామకృష్ణంనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయుడు కామేశ్వరరావును సన్మానిస్తున్న జేవీవీ ప్రతినిధులు

లావేరు: మండలంలోని అదపాక హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ హైస్కూల్‌లో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.వి.కామేశ్వరరావును ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.బాలకృష్ణ, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, జిల్లా నాయకుడు పి.ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు జి.మురళి, పిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతికి అష్టోత్తర పుస్తకార్చన



అష్టోత్తర పుస్తక పూజ

శ్రీకాకుళం కల్చరల్: రాజమండ్రిలోని జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో శ్రీకాకుళం నగరానికి చెందిన కాశిన వెంకటేశ్వరరావు రచించిన శ్రీవాణి వికాసం పుస్తకానికి అష్టోత్తర పుస్తకార్చనలు గురువారం నిర్వహించారు. వీటిని భక్తులకు విరతణ చేసేందుకు ఆలయ నిర్మాణ సారధి తోట సుబ్బారావుకు అందించినట్లు రచయిత తెలిపారు. పుస్తకంలో 108 ప్రసిద్ధ సరస్వతీ మాత దేవాలయాల విశేషాలు పొందుపరిచినట్లు చెప్పారు.

షిరిడీసాయికి ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని సాయిదర్బార్‌లో షిరిడీ సాయినాథునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామికి ఉదయం కాగడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది.



ఎచ్చెర్ల క్యాంపస్: చిలికపాలెంలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



జి.సిగడాం: నిద్దాంలో వైద్య పరీక్షల కోసం తరలివచ్చిన గ్రామస్తులు



శ్రీకాకుళం రూరల్: వైద్య శిబిరంలో పాల్గొన్న యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



గార: వాడాడలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం గార మండలం వాడాడ పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వంలో విద్య, వైద్యం రంగాలకే అధికంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తి ఇచ్చేలా పథకాల అమలు జరుగుతోందన్నారు. విలేజ్ క్లినిక్‌లు సైతం ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, సర్పంచ్ సుంకాన సురేష్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీటీసీ వాడాడ విజయలక్ష్మి, తహశీల్దార్ జెన్ని రామారావు, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేయించుకోవాలి

శ్రీకాకుళం రూరల్: ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. కనుగులవానిపేటలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో ఈ ప్రభుత్వం ప్రథమ స్థానంలో ఉందన్నారు. కాగా, శిబిరంలో 312 ఓపీలు నమోదైనట్లు పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శిమ్మ రామ్మోహన్, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, పార్టీ నాయకులు గంగు నరేంద్రకుమార్, కనుగుల అప్పలనాయుడు, సూరాడ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. చిలకపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, ఎంపీడీఓ రమాదేవి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి



లావేరు: గురుగుబిల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

లావేరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని గురుగుబిల్లి సచివాలయం పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 210 మందికి వైద్య తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కంది నాని, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిద్దాంలో..

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు.మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైద్యాధికారులు, సర్పంచ్ పాదిలాపు బుజ్జిమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెప్పలవలసలో..

రణస్థలం: మండలంలోని తెప్పలవలస గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రాష్ట్ర నోడల్ అధికారి, గ్రామ, వార్డు సచివాలయాల కమిషనర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యుడు ధర్మాన సుమన్ మాట్లాడుతూ 260 మందికి ఆరోగ్య పరీక్షలు చేశామరు. 14 మందిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశామన్నారు. 80 మందికి కంటి కళ్ల పరీక్షలు నిర్వహించి, 39 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



రణస్థలం: తెప్పలవలసలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రోగులు



జి.సిగడాం: నిద్దాంలో పౌష్టికహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



లావేరు: గురుగుబిల్లిలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



రణస్థలం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఈ సందర్భంగా విజయవంతంగా నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వాన ప్రమీల, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే ప్రజల జీవన ప్రమాణాల మెరుగు



జి.సిగడాం: గడపగడపకు బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పైడిభీమవరం మహిగ్రాండ్‌లో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నో అభివృద్ధి ఫలాలు ప్రజలకు నేరుగా అందించారన్నారు. రాజధాని వికేంద్రీకరణ, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, పోర్టులు, పరిశ్రమలు, ఐటీ రంగం, స్కూల్స్, ఆస్పత్రుల అభివృద్ధి, నాడు-నేడు, జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్ష వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం విజయోత్సవ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన మహంతి పెదరామినాయుడుని ఎమ్మెల్యే సత్కరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, జేసీఎస్ మండల ఇంచార్జి చిల్లా వెంకటరెడ్డి, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, పైడిభీమవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గొర్లె తిరుపతినాయుడు, రణస్థలం ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ కిల్లారి రమణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మహంతి చినరామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో మార్పులు అనివార్యం

- బీఆర్‌ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు అనివార్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. నూతన విద్యావిధానం అమలు, వ్యూహాలు, సవాళ్లు అంశంపై వర్సిటీ విద్యావిభాగం, ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ (న్యూఢిల్లీ), సమగ్ర శిక్ష (అమరావతి), యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. అదే రోజుతో సదస్సు ముగిసింది. నూతన విద్యా విధానం-2020 ఉన్నత, ప్రాథమిక, సాంకేతిక విద్యల్లో పక్కాగా అమలు జరగాలని అన్నారు. చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్, ఫౌండేషన్‌ల విద్యకు నూతన విద్యా విధానంలో ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ఈ మేరకు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులకు శిక్షణ, పూర్తిస్థాయి ఉపాధ్యాయుల నియామకం, మౌలిక వసతులు అవసరమని తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో నూతన విద్యావిధానం అమలుకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ ఉపాధ్యా విద్యా మండలి (ఎస్ సీటీఈ) న్యూఢిల్లీ సభ్యులు ఘంటా రమేష్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం అమల్లో ప్రభుత్వాలు, విద్యా రంగ నిపుణలు, తల్లి దండ్రులు, విద్యార్థులు అభిప్రాయాలు, సూచనలు, సలహాలు అమల్లో కీలకమని చెప్పారు.

విద్యారంగ నిపుణులు ఆచార్య ఎస్.పద్మనాభయ్య మాట్లాడుతూ ప్రారంభంలో నూతన విద్యా విధానంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని అన్నారు. వాటిని అధిగమిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (భువనేశ్వర్) ప్రొఫెసర్ బి.ఎస్.పండా మాట్లాడుతూ బలోపేతమైన విద్య విద్యార్థులకు అందాలని చెప్పారు. శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యలో సాంకేతిక అంశాలు కీలకమని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.హెచ్.రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, డీసీడీ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత, సదస్సు కన్వీనర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం, సహాయ కన్వీనర్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, విద్యా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్.వి.స్వామినాయుడు, డాక్టర్ జె.ఎల్.సధ్యా రాణి, డాక్టర్ ఎం.ప్రభాకర్‌రావు, డాక్టర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

నిరంతర శ్రమతోనే విజయం



వ్యక్తిత్వ వికాస శిక్షణలో మాట్లాడుతున్న మనీ మోహన్ త్రినాథ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నిరంతర శ్రమించాలని హైదరాబాద్‌కు చెందిన ఏస్ అకాడమీ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మనీ మోహన్ త్రినాథ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఇంజినీరింగ్ విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూల్లో విజయం సాధించాలంటే నిరంతరం కష్టపడాలన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధపై చాలా పరిశ్రమలు ఆధారపడుతున్నాయన్నారు. డిప్లమా, ఐటీఐ విద్యార్థులు తక్కువ వేతనానికి పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు, దేశ, విదేశాల్లో ఉన్నత విద్య లక్ష్యంగా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైం/కాశీబుగ్గ: నగరంలోని ఓ వివాహిత భర్తతో గొడవపడి అదృశ్యమైనట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు పేర్కొన్నారు. ఫాజుల్‌బేగ్‌పేట్‌కు చెందిన కరగాన విజయ్‌కుమార్‌కు పక్క వీధిలోనే ఉంటున్న తెంబూరు దుర్గారావు దంపతుల కుమార్తె అలేఖ్యతో ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి రితిక అనే పాప ఉంది. విజయ్‌కుమార్ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆరు నెలలుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 2న శ్రీకాకుళం దిశ పోలీస్ స్టేషన్‌లో ఇరువురికి కౌన్సిలింగ్ జరిగింది. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి తల్లీకుమార్తెలు కనిపించడం లేదు. వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



కేశవరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎంపికైన క్రీడాకారులు



పొన్నాడ కేజీబీవీ నుంచి ఎంపికైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 19లో వాలీబాల్, సాఫ్ట్‌బాల్, స్విమ్మింగ్, క్రికెట్ అంశాల్లో ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను గురువారం హెచ్‌ఎం చల్ల భారతి, పీడీ మొజ్జాడ వెంకటరమణ, ఉపాధ్యాయులు అభినందించారు. పొన్నాడ కేజీబీవీ నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఫుట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, థైక్వాండో, జూడోలో జూనియర్, సీనియర్ విభాగాల్లో పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ ఎం.సూర్యకళ, పీడీ బి.సన్యాసమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

కాలువలో జారిపడి కారు డ్రైవర్ మృతి



సుదర్శనరావు (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని పోరాం గ్రామ సమీపంలో గల మడ్డువలస కాలువలో జారిపడి శ్రీకాకుళం జిల్లా లోలుగు గ్రామానికి చెందిన నవిరి సుదర్శనరావు (30) గురువారం మృతి చెందాడు. పోరాం గ్రామానికి చెందిన బూరాడ విష్ణుమూర్తి కారు డ్రైవర్‌గా సుదర్శనరావు పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం విజయనగరం నుంచి పోరాం వచ్చిన సుదర్శనరావు మడ్డువలస ప్రధాన కుడికాలువలో స్నానానికి వెళ్లి, కాలువలో జారిపడ్డాడు. స్నానానికి వెళ్లిన వ్యక్తి ఎప్పటికీ రాకపోవడంతో విష్ణుమూర్తి కుటుంబసభ్యులు, స్థానికులు కాలువ వద్దకు వెళ్లి చూసి, గట్టుపై దుస్తులు, సెల్‌ఫోన్ ఉండడం గమనించారు. ఈ విషయం పోలీసులకు చేరవేయగా, ఫైర్ సిబ్బంది అక్కడికి వచ్చి తహసీల్దార్ సుదర్శనరావు ఆదేశాల మేరకు కాలువలో వెతికారు. కొద్ది దూరంలోనే సుదర్శనరావు మృతిచెంది కనిపించడంతో మృతదేహాన్ని బయటకు తీసి రేగిడి పోలీసులకు అప్పగించారు. వీఆర్‌ఓ ఏవీ సత్యనారాయణ శవపంచనామా నిర్వహించగా, రేగిడి పోలీసులు కేసునమోదు చేసి, రాజాం సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు సుదర్శనరావుకు ఐదునెలల క్రితమే వివాహం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మృతుడి భార్య అరుణతో పాటు బంధువులు సంఘటనా స్థలానికి వచ్చి భోరున విలపించారు.

సుబ్రహ్మణ్యస్వామికి భస్మాభిషేకం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో నాగావళి తీరంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి గురువారం భస్మాభిషేకం నిర్వహించారు. అర్చకులు పెంట కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామికి బహుళ షష్టి సందర్భంగా ప్రత్యేకంగా భస్మంతో అభిషేకం చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తపాలా సేవలపై అవగాహన

బూర్జ: బ్యాంకు సేవలకు దీటుగా తపాలా సేవలు విస్తృతమయ్యాయని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. మండలంలోని ఓవిపేటలో గురువారం తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. తపాలాశాఖ సేవలు ప్రజలకు వివరించారు. గ్రామంలోని వృద్ధులు, ఉత్తమ వినియోగదారులను సన్మానించారు. తపాలాశాఖ సిబ్బంది, స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇసాయి వెంకటరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.